సాగు యంత్రాలపై సబ్సిడీ ఏది?

- రాయితీ కోసం రైతుల ఎదురుచూపులు
- రైతులకు రాయితీపై అందని పరికరాలు

తాడూరు: పంటల సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గతంలో పరికరాలను రైతులకు సబ్సిడీపై సరఫరా చేసేది. దీంతో రైతులు సాగులో యంత్రాల ద్వారా పనులు చేసి సమయాన్ని, డబ్బులను ఆదా చేసేవారు. కాని ఎనిమిదేళ్ల నుంచి సబ్సిడీపై ప్రభుత్వం మంగళం పాడింది. రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. అధికారులు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వడానికే పరిమితం అవుతున్నారు. సబ్సిడీ యంత్రాలపై శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎనిమిదేళ్లుగా వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ లేకపోవడంతో పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది.

సాగులో యంత్రాలే కీలకం

రోజుకురోజుకు వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వైపు వెళ్తోంది. పంట సాగు మొదలు కొని దిగబడి వచ్చే వరకు రైతులు పరికరాలు తప్పనిసరిగా వినియోగించాల్సిన పరిస్థితి ఉంది. ట్రాక్టర్ల ద్వారా దుక్కులు దున్నడం చదును చేయడం యంత్రాల ద్వారా విత్తనాలు వేయడం వంటి అనేక పనులు నిర్వహిస్తున్నారు. యంత్రాలతో తక్కువ ఖర్చు తక్కువ సమయం పడుతుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

కొనుగోలు భారం

వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతోపాటు సమయం కూడా చాలా ఆదా అవుతోంది. కూలీల ద్వారా వారం రోజుల్లో జరిగే పని యంత్రాలతో ఒక్క రోజులో పూర్తవుతోంది. ప్రస్తుతం మారుతున్న నేపథ్యంలో 10 ఏళ్ల కిందట పోలిస్తే యంత్రాల వినియోగం బాగా పెరిగింది. చిన్న సన్నకారు రైతులు సైతం అప్పులు తెచ్చి యంత్రాలు పరికరాలను సమకూర్చుకుంటున్నారు. గతంలో రోటోవేటర్ రూ.80వేలు ఉండగా ప్రస్తుతం రూ.లక్షకు పైగా ఉంది. కల్టివేటర్ కలుపు తీసే యంత్రం రూ.లు 25వేలు ఉండగా ప్రస్తుతం రూ.35 వేలకు పెరిగింది. యాంత్రాలను రాయితీపై భారంగా మారింది.


వరికోస్తున్న వరికోత యంత్రం


కలుపుతీత యంత్రం

ప్రభుత్వంపైనే ఆశలు

వ్యవసాయ పరికారాలపై ఎస్సీ, ఎస్టీలకు 95శాతం , మిగిలిన వర్గాలకు 50 శాతం రాయితీ ఇచ్చేవారు. ట్రాక్టర్‌తోపాటు పొలం దున్నడానికి కల్టివేటర్, రోటోవేటర్, కవర్‌పిల్లర్, వరి నాటు యంత్రాలు, పవర్ వీలర్, పురుగుల మందు యాంత్రాలు, ఇతర వ్యవసాయ అనుబంధ పరికారాలను సబ్సిడీపై అందించే వారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో లేకపోవడం రైతులు మొత్తం ధర చెల్లించి కొనాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఒక్క యంత్ర పరికరాలను కొనాలంటే రైతులకు పెద్ద మొత్తంలో ఖర్చవుతోంది. పథకం అమలు కోసం ప్రస్తుత ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ఆదేశాలు వస్తే అందిస్తాం

ప్రస్తుతం పంటల సాగులో పరికరాల ప్రాధాన్యం పెరిగింది వాస్తవమే. ప్రభుత్వం నుంచి సబ్సిడీపై యంత్రాలు సరఫరా కావడం లేదు. యంత్రాలను రాయితీపై ఇవ్వాలని రైతులు అడుగుతున్నారు. అధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి రాయితీ పరికరాలు వస్తే అందిస్తాం

సందీప్‌కుమార్ రెడ్డి, ఏఓ, తాడూరు

సబ్సిడీపై యంత్రాలు ఇవ్వాలి



గ్రామంలో అధికంగా పత్తి, మొక్కజొన్న, కంది సాగు చేశారు. కూలీలతో కలుపు తీసేందుకు సమయం ఎక్కువ తీసుకుంటుంది. కలుపు తీసే యంత్రాలతో కలుపు తీస్తే సమయంతోపాటు డబ్బులు ఆదా అవుతాయి. ప్రభుత్వం వెంటనే రాయితీపై వ్యవసాయ పరికరాలు సరఫరా చేయాలి.

– బాలస్వామి, రైతు, అల్లాపూర్

పరికరాలు కొనలేకపోతున్నాం



వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అధిక ధరలు కారణంగా కొనలేకపోతున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో పరికరాల వినియోగం అధికంగా ఉంది. ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలను పంపిణీ చేయాలి. పంటల సాగు ఇబ్బందిగా ఉంది.

– బాలస్వామి, రైతు, పర్వతాయిపల్లి

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న పరశురాములు

కల్వకుర్తి రూరల్: ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులిజాల పరశురాములు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1, 2 తేదీలలో నాగర్‌కర్నూలు జిల్లా మూడో మహాసభలు కల్వకుర్తిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు మార్కెట్ యార్డులో భారీ బహిరంగ, రెండో రోజు కల్వకుర్తిలో ప్రతినిధుల సభ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకుడు చాడ వెంకటరెడ్డి, బాల్ నరసింహ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డాక్టర్ శ్రీను, దార దాసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలకు తరలిన మహిళలు

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిర మహిళా శక్తి సంబరాలకు మన్ననూర్‌తో పా టూ వివిధ గ్రామాల నుంచి మహిళ లు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అచ్చంపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్న మహిళా శక్తి సంబరాలకు మండలంలోని ప్రశాంతి నగర్, వెంకటేశ్వర్లబావి, మాచారం, తుర్కపల్లి, వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు తదితర గ్రామాల నుంచి మహిళలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

అచ్చంపేటకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

చారకొండ: అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలకు మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ అధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలారు. తరలిన వారిలో మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ప్రశాంత్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు అంజయ్య, గణేష్ గౌడ్, గోరటి శివ, సత్తార్ ఉన్నారు.

లింగాలలో..

లింగాల: ఇందిరా మహిళా శక్తి సంబరాలకు మండలం నుంచి మండల మహిళా సమాఖ్య, గ్రామ సంఘాల మహిళలు అచ్చంపేటలకు తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు, మహిళలు ఉన్నారు.

ఆరు గ్యారంటీ అమలులో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి

కందనూలు: ఆరు గ్యారంటీ అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి విమర్శించారు. సోమవారం బీజేపీ నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు అధ్యక్షతన కొల్లాపూర్ క్రాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. జిల్లా ఎన్నికల ప్రభారీ బొక్కా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మండల ఎన్నికల కార్యశాలలు ని ర్వహించి కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయాలన్నారు. మాజీ ఎంపీ పోతుగంటి రాములు, జాతీ య బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధులు దిలీపాచారి, సుధాకర్‌రెడ్డి, సోలంకి శ్రీనివాస్, ఎంపీ కాంటెస్టెడ్ అభ్యర్థి భరత్ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి, మంగ్యా నాయక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరిస్తాం

కల్వకుర్తి రూరల్: లయన్స్ క్లబ్ సేవలు విస్తరిస్తామని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్లు జూలూరు రమేష్ బాబు, జూలూరు రఘులు అన్నారు. సోమవారం పట్టణంలోని లయన్స్ భవనంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కల్వకుర్తి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చిగుళ్ల పల్లి శ్రీధర్, కార్యదర్శిగా కల్మిచెర్ల గోపాల్, కోశాధికారిగా మిరియాల శ్రీనివాస్ రెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గౌరవ సభ్యుడు బచ్చు రామకృష్ణ, క్లబ్ కోశాధికారి గోవిందు శ్రీనివాస్ క్లబ్ సభ్యులు పాపిశెట్టి శ్రీనివాస్, సతీష్ గుప్తా, దుగ్గి వెంకటేష్, గుబ్బ కిషన్, మయూరి వేణు, జూలూరు సత్యం, రవి గౌడ్, గణేష్, జూలూరు ప్రకాష్, అప్పాయిపల్లి శ్రీనివాస్, సాత వెంకటేశ్వర్లు, సురేందర్ రెడ్డి, గోవింద్ కృష్ణయ్య, శివా జగదీశ్వర్, పస్పుల రాఘవేందర్ ,బుచ్చయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన కమిటీ

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం 'పూర్వ విద్యార్థుల సంఘం' ఏర్పాటుకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సహకరించాలని పాపిశెట్టి అశోక్‌కుమార్, కల్ముల నాసరయ్య, రాజారాం గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సరిపోకపోవడంతో పాఠశాలలో చదువుకుంటున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు కొన్ని ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 23న బుధవారం అమ్రాబాద్ కొత్త బస్‌స్టాండ్ ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహిస్తున్నట్లు అందరు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరం ఏర్పాటు



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో సోమవారం ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మందికి కంటి, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వీరమల్ల వెంకటస్వామి, కార్యదర్శి రాజేష్, ప్రచార కార్యదర్శి శోభన్ బాబు, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రవికుమార్, రవిచంద్ర, శ్రీధర్, ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

వెల్దండ: మండలంలోని పోతేపల్లి నుంచి జూపల్లి వరకు నిర్మిస్తున్న బీటీరోడ్డు పనుల్లో భాగంగా సోమవారం పోతేపల్లిలో సీసీరోడ్డు పనులను మాజీ సర్పంచ్ వావిళ్ల వెంకటమ్మ ప్రారంభించారు. జూపల్లి వరకు బీటీరోడ్డు ఏర్పాటు కావడంతో శ్రీశైలంరోడ్డు, నల్గొండ రోడ్డు మార్గ సులభతరమవుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, భీమయ్య, బుచ్చయ్యగౌడు, ఆంజనేయులు, సత్యనారాయణ, వెంకటయ్య, యాదగిరి, గణపతి, అల్లాజీ, ఎల్లయ్య, చిన్న జంగయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం



కల్వకుర్తి టౌన్: నేరాల అదుపులో సీసీ కెమెరాలు కీలకమని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ వెనకభాగంలో నూతనంగా ఏర్పాటైన భగత్ సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన స్థానిక పోలీసులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి వేళ గస్తీ పెంచామన్నారు. సైబర్ నేరాలా బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక క్యాంపెయినింగ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కాలనీలోని ఖాళీ ప్రదేశంలో డీఎస్పీతో పాటుగా, సీఐ, ఎస్‌ఐ, కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, కాలనీ అధ్యక్షుడు జంగయ్య, కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పెద్దకొత్తపల్లి: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రచించిన భగవద్గీతపై 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అచ్చంపేట-నాగర్‌కర్నూల్ కమిటీ' ఆధ్వ ర్యంలో మండలంలోని తిరుమలంపల్లిలో సోమవారం ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మనోహర్ శ్రేష్టి, సాయి శంకర్ శ్రేష్టి, వరుణ్ శ్రేష్టి, నరసింహ్మ, ఆంజనేయులు యాదవ్, డా.బాలస్వామి, తిరుపతి, రమాదేవి, స్వప్న, జంగమ్మ పాల్గొన్నారు.

పట్టుబడిన అనుమానాస్పద వ్యక్తులు

తిమ్మాజిపేట: మండలంలోని ఎదిరేపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్నారు. గమనించిన ఓ రైతు గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా కొందరు వారిని పట్టుకునేందుకు యత్నించగా అందులో ఒకరు పారిపోగా ముగ్గురు దొరికారు. పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. పట్టుబడిన వారు బిజినేపల్లి మండలంలోని మంగనూరు గ్రామస్తులుగా గుర్తించారు. సోమవారం ఉదయం గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. కుందేళ్ల షికారికి వచ్చామని పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. పారిపోయిన మరోకరు దొరికితే గాని పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు.

అండగా ఉంటా

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని విద్యానగర్‌లో నివాసముంటున్న వంగూరు మాజీ ఎంపీపీ మణెమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో సోమవారం బాధితురాలిని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భరోసా పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

విద్యాభివృద్ధికి కృషి

తెలకపల్లి: విద్యాభివృద్ధికి స్వేరోస్ కృషి చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వేరోస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత రంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సంపత్‌కుమార్, పరమేశ్వర్, రమేష్, కాశయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

జనతాబార్‌లో చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని జనతాబార్‌లో చోరీ జరిగిన ఘటన సోమవారం చోటుచేసుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుకాణం పైభాగంలో ఉన్న రేకులను కట్టర్‌తో తొలగించి దొంగ దుకాణంలోకి దిగాడు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 35,000 నగదు, సీసీ కెమెరాల డీవీఆర్, రూ.15వేల విలువగల మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లాడు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన గోసుల రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నరసింహరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



కల్వకుర్తి టౌన్/తెలకపల్లి/వెల్దండ: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు నిర్వహించారు. తెలకపల్లి నెహ్రూ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు కేక్‌కట్ చేసి కార్యకర్తలు పంచుకున్నారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ నాయకులు బాలగౌడ్, సూర్యబాలగౌడ్, ప్రకాష్, ఈశ్వరయ్య, నిరంజన్, బుచ్చిరెడ్డి, శారద నరహరి, వెల్దండ సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, పర్వత్ రెడ్డి, మోతిలాల్‌నాయక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

వెల్దండ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కె. వెంకటనర్సింహరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం బండోనిపల్లి, పల్లుతండా గ్రామాన్ని సందర్శించారు. విద్యుత్ సమస్య లేకుండా నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఏడీఈ శంకరయ్య, ఏఈలు వెంకటేష్, సిబ్బంది నాగేష్, మల్లేష్, ఉన్నారు.

'కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేస్తాం'

బల్మూర్: నల్లమలలోని ప్రతి సెంటును కృష్ణా జలాలతో తడిపి.. సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మండలంలోని గట్టుతుమ్మెన్ శివారులోని కేఎల్ఐ కాల్వలోకి వదిలిన కృష్ణా జలాలకు సోమవారం ఆయన అధికారులు, నాయకులతో కలిసి పూలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి శ్రేయస్సు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని కొనియాడారు.

6 నుంచి సర్జికల్ క్యాంపు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి.. రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. వైద్యం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వచ్చే నెల 6 నుంచి మూడో మెగా సర్జికల్ క్యాంపు నిర్వహించనున్నామని, నియోజకవర్గంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా 12 రకాల శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. పూర్తి వివరాలు, పేర్లు నమోదు చేసుకోవడానికి వైద్యులు మహేష్ (95539 96060), శార్లీ ఆంటోని (86399 71676)లను సంప్రదించాలని సూచించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఆలయ కమిటీ చైర్మన్ వేముల నర్సింహరావు, పాలకవర్గం సభ్యులు, నాయకులు తిప్పర్తి నర్సింహరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గంగుల నర్సింహరెడ్డి, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అన్యాయం

చారకొండ: నాయీ బ్రాహ్మణేతరులు సెలూన్ దుకాణాలు పెట్టుకోవచ్చన్న హైకోర్టు తీర్పుతో నాయీ బ్రాహ్మణులు రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆ సంఘం నాయకులు వాపోయారు. మండల కేంద్రంలో సోమవారం నాయీ బ్రాహ్మణుల సంఘం మండల సమాశాన్ని మండల కేంద్రంలో దుర్గమాత దేవాలయం ఆవరణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లంపల్లి రవి హాజరై మాట్లాడారు. కుల వృత్తిని నమ్ముకున్న జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. న్యాయం చేయాలని కోరారు. నాయకులు శంకరయ్య, తిరుపతయ్య, వెంకటయ్య, సత్యనారాయణ, రాము, వెంకటేష్, ఆంజనేయులు, తిరుమల్లేష్, కృష్ణయ్య, రామకృష్ణ, రమేష్, అనిల్, నిరంజన్, కృష్ణ తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిత్యాన్నదానానికి సోమవారం కల్వకుర్తి ప్రాంతానికి చెందిన క్రాంతికుమార్, శిరీష దంపతులు రూ. 25,116లు విరాళంగా అందించారు. కుమారుడు ఉమామహేశ్వర్ జన్మదినం సందర్భంగా విరాళం అందించినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, సతీష్, కవికుమార్, రమేష్, ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాడులు చేస్తే సహించం

నాగర్‌కర్నూల్: పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించమని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం బిజినేపల్లి మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జంగయ్య యాదవ్‌పై సోమవారం గ్రామంలో కొంత మంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జంగయ్యను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తిమ్మాజిపేట: మండలంలోని కోడుపర్తి గ్రామానికి చెందిన రాగి ఎల్లయ్య, ఆయన కుమారుడు రాగి రాము ఇద్దరు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మర్రి జనార్దన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదవ శాత్తు గాయపడిన నాగిరెడ్డి, గోవర్దన్‌రెడ్డిలను పరామర్శించారు. నాయకులు కిల్లె మల్లయ్య, స్వామి, జయపాల్‌రెడ్డి, మణెమ్మ, నాగయ్య, మల్లారెడ్డి, శంకర్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

కొల్లాపూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలు వేల సంఖ్యలో ఉన్నారని వివరించారు. పార్టీలకు అతీతంగా నిజమైన అర్హులకు ఇళ్లు కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకులు కురుమయ్య, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎస్ఈని కలిసిన నాయకులు

కల్వకుర్తి: జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకట్ నర్సింహరెడ్డిని కల్వకుర్తి మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డితో పాటుగా కాంగ్రెస్ నాయకులు కలిశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీలోని వివిధ కాలనీలలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఆయన వినతిని అందజేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకుడు షానవాజ్‌ఖాన్ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: కోడేరు మండల కేంద్రానికి చెందిన రాములు ఈనెల 17న పెద్దముద్దునూరు గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా 11 కేవీ పనులు చేస్తుండగా తీగలు తగిలి గొంతుకు గాయమైంది. దీంతో హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. సోమవారం బాధితుడు విధుల్లో నిర్లక్ష్యం వహించిన విద్యుత్ అధికారుల కారణంగా తాను గాయపడ్డట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలి

తాడూరు: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని యత్మాతాపూర్ గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రుణమాఫీ, వడ్డీ లేని రుణాలు తదితర పథకాలపై అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్, రాముడు, నరేందర్, కార్తీక్, రమేష్, దశరథం తదితరులు పాల్గొన్నారు.


కలప పట్టివేత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ నుంచి అక్రమంగా తరలిస్తున్న కలపను ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. ఫారెస్టు రేంజర్ ఈశ్వర్ వివరాలు వెల్లడించారు. పెట్రోలింగ్‌లో భాగంగా సిబ్బంది తిరుగుతుండగా సోమవారం మొలచింతపల్లి కోతిగుండు ఏరియా అటవీ సమీపంలో నారవేప మొద్దులను కోసి రెండు ఎద్దులబండ్లపై తరలిస్తుండగా పట్టుబడ్డారు. నిందితుడు గ్రామానికి చెందిన నార్లంపల్లి వెంకటస్వామివిగా గుర్తించారు. మొద్దులను స్వాధీనం చేసుకొని టింబర్ డిపోకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, ముజీబ్ ఘెరి, శివకుమార్, జయరాజు,బీట్ అధికారి శ్యామ్, శశికుమార్, వాచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద నీరు వృథా కాకుండా అరికట్టాలి

చారకొండ: మండల కేంద్రంలోని వాగు, గోకారం చెరువు నుంచి వృథాగా వరద నీరు పోతోందని దీనిని అరికట్టాలని బీజేపీ నాయకుడు చింతపల్లి కిరణ్ గౌడ్ డిమాండ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వరద నీరు వృథా కాకుండా రిజర్వాయర్, చెక్ డ్యాంల నిర్మించాలన్నారు. కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించాలని కోరారు. నాయకులు శ్రీకాంత్, వెంకటయ్య, పవన్ ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పెద్దకొత్తపల్లి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. రెండు రోజుల నుంచి పాఠశాలలో 19 మంది విద్యార్థులు వైరల్ జ్వరాల బారిన పడి బాధపడటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పరీక్షలు చేసి మందులు అందించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను డిప్యూటీ డీఎంహెచ్ఓ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల్లోని వంట గదులు, నీటి ప్లాంట్‌ను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణస్వామి, ప్రిన్సిపాల్ అకుల్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

కల్వకుర్తి రూరల్: స్వామి వివేకానంద సేవ బృందం ఆధ్వర్యంలో 13 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలపై బృందం అధ్యక్షుడు ప్రత్యేక బ్రోచర్ సిద్ధం చేశారు. ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోమవారం బ్రోచర్ ఆవిష్కరించారు. సేవలను వారు కొనియాడారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత శివ కుమార్, భరత్, జీవన్ కుమార్, మారుతి, అబాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

